క్లుప్తంగా

ఇంటి స్థలాల పరిశీలన



ఇంటి పట్టాలను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి

మద్దికెర: మండల కేంద్రంలోని కొండమ్మబావి వద్ద ఉన్న ఇంటి స్థలాలను మంగళవారం జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఇల్లులేని వారందరికీ ఇంటిస్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. వచ్చిన అర్జీలను పరిశీలించి అర్హత కలిగిన వారందరికీ మంజూరు చేయడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు త్వరలోనే పనులు మొదలుపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.ఎంపీటీసీ రామకృష్ణారెడ్డి, వార్డు సభ్యులు మల్లికార్జున, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు వైఎస్సార్‌సీపీ నాయకులు బొమ్మనపల్లి వెంకటేశులు, రామాంజులు ఉన్నారు.

హామీల అమలులో బీజేపీ విఫలం

ఎమ్మిగనూరుటౌన్: గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఐ రాష్ట్ర నాయకుడు రామచంద్రయ్యఅన్నారు. మంగళవారం పట్టణంలోని చిన్న కమేళా ప్రాంతంతో పాటు పార్లపల్లె గ్రామంలో ఆయా పార్టీలఆధ్వర్యంలో ప్రచారభేరి పాదయాత్రను నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజా,కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని, ఇందుకు ప్రజలంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. భాస్కర్‌యాదవ్, హనుమంతు, చిన్నన్న, తిమ్మగురుడు, విజయ్,రాజు పాల్గొన్నారు.

ముస్లింలకు ఖర్జూరాల పంపిణీ

మద్దికెర: రంజాన్ పర్వదినం పురస్కరించుకొని ఉపవాస దీక్షలో వున్న ముస్లింలకు పెరవలి గ్రామానికి చెందిన పారా విశ్వనాథ్, పారా రామచంద్రప్రసాద్ మంగళవారం మండల పరిధిలోని పెరవలి, హంప, ఎం.అగ్రహారం గ్రామాలలో ఖర్జూరాలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలకు సహాయ సహకారాలు అందించడం మన బాధ్యతన్నారు.

'మిషన్ వాత్సల్య'కు 470 దరఖాస్తులు

తుగ్గలి : 'మిషన్ వాత్సల్య' పథకానికి పత్తికొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 470 మంది దరఖాస్తు చేసుకున్నారని సీడీపీఓ సావిత్రి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులను కోల్పోయిన, నిరుపేద, నిస్సహాయ స్థితిలో ఉన్న పిల్లలకు ఆర్థిక చేయూతనందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ×మిషన్ వాత్సల్య×కు మంచి స్పందన లభిస్తోందన్నారు. 18ఏళ్ల లోపు పిల్లల విద్య, వైద్యం కోసం ప్రవేశపెట్టిన ఈ పథకానికి ఈనెల 15వతేదీ నాటికి ప్రాజెక్టు పరిధిలోని పత్తికొండ, గోనెగొండ్ల, దేవనకొండ, మద్దికెర, తుగ్గలి మండలాల నుంచి మొత్తం 470 దరఖాస్తులు అందాయన్నారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ఇప్పటి వరకు 240 దరఖాస్తులు ఆన్‌లైన్ చేశామని, మరో రెండురోజుల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందన్నారు.

కస్తూర్బాలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

హొళగుంద:మండల కేంద్రంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి 6, 7, 8వ తరగతితో పాటు ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో చేరెందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని స్పెషల్ ఆఫీసర్ రుక్సానా కోరారు. ఈ నెల 20 వరకు గడువు ఉన్నట్లు తెలిపారు. నిరుపేద విద్యార్థినులు,అనాథ బాలికలు, బడిఈడు, బడి వదిలేసిన బాలికలకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. 6వ తరగతిలో 40 సీట్లు, 7, 8వ తరగతిలో 7 సీట్లు, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 40 సీట్లు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేవరకూ పోరాటం



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ కార్యదర్శి డాక్టర్ పార్థసారథి

గోనెగండ్ల : వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే వరకూ పోరాటాలు చేస్తామని బీజేపీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర వాల్మీకి సంఘం నాయకుడు డాక్టర్ పార్థసారథి తెలిపారు. మంగళవారం మండలంలోని గాజులదిన్నె గ్రామంలో వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరించాలని కోరు తూ వాల్మీకులతో కలిసి ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వాల్మీకులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా పూర్తిగా వెనుకపడిపోయారన్నారు. దేశవ్యాప్తంగా 10 కోట్ల మంది వాల్మీకులు ఉన్నారని, అందులో 9.40 కోట్ల మంది ఎస్సీ, ఎస్టీలుగా ఉన్నారని,మన రాష్ట్రంలో రాయలసీమతో పాటు మరో నాలుగు జిల్లాలో మాత్రమే బీసీలుగా కొనసాగుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో వాల్మీకులు సంజన్న, శ్రీనివాసులు, రంగస్వామి, సురేంద్ర, ప్రభాకర్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

పుష్కలంగా నీరు.. విస్తారంగా పంటలు

- తుంగభద్రలో ఏడాది పొడవునా నీటి ప్రవాహం
- నదీ తీరంలో ఖరీఫ్‌తో పాటు రబీలోనూ పంటల సాగు
- ప్రభుత్వం నుంచి రైతులకు అన్ని విధాల సహకారం



తుంగాతీరంలో సాగుచేసిన మొక్కజొన్న

ఎమ్మిగనూరు: తుంగభద్రనది తీరం వాణిజ్య పంటల నిలయంగా మారింది. నాలుగేళ్లుగా విస్తారంగా వర్షాలు కురవటం..ప్రకృతి అనుకూలిస్తుండటం . ఏడాది పొడవునా నది ప్రవాహం కొనసాగుతుండటంతో ఖరీఫ్‌లోనే కాక రబీలోనూ పుష్కలంగా పంటలు పండుతున్నాయి.

కళకళలాడుతున్న తుంగభద్ర తీరం

తుంగభద్ర నదిలో నీటిప్రవాహం కొనసాగుతుండటం అన్నదాతకు ఊరట కల్గించే అంశం. అదేవిధంగా ప్రభుత్వ పరంగా రైతుభరోసా సహాయం, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పంటకు గిట్టుబాటు ధర కల్పించటం తదితర అంశాలతోపాటు వ్యవసాయశాఖ అధికారులు ఎప్పటికప్పుడు పంటల పర్యవేక్షణ చేపట్టడం, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించటంతో తుంగభద్ర తీరం పచ్చటి పంటలతో కళకళలాడుతోంది.

ఆశాజనకం సాగునీటి వనరులు

ఎమ్మిగనూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో సాగునీటి వనరుల్లో పుష్కలంగా సాగునీరుంది. ఈఏడాది కూడా రబీ పంటకు ఢోకాలేకుండా పంటలు గట్టెక్కుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా తుంగభద్ర నదితీరంలో రబీ పంటగా రైతులు వరి, మొక్కజొన్న పంటలను విస్తారంగా సాగుచేశారు. నాలుగేళ్లుగా తుంగభద్ర నది అంతరాయం లేకుండా ఏకధాటిగా ప్రవహిస్తుండటం రైతులకు మేలు కలిగిస్తోంది. అదేవిధంగా తుంగభద్ర దిగువ కాలువ నుంచి, గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి, గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాల నుంచి సాగునీరు అందుతుండటంతో రైతులు రబీ పంటను విస్తారంగా సాగుచేశారు.

8,778.9 హెక్టార్లలో పంటల సాగు

ఎమ్మిగనూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో రబీ పంటల సాధారణ విస్తీర్ణం 9,810హెక్టార్లు అయితే సాగు విస్తీర్ణం 8,778.9 హెక్టార్లుగా నమోదైంది. ఈ ఏడాది రైతులు వరితో పాటు వాణిజ్య పంటలను రైతులు విస్తారంగా సాగుచేశారు. అదే ఉద్యానవనశాఖ పరిధిలో ఉల్లి, మిర్చి పంటలు 730.5 హెక్టార్లలో సాగయ్యాయి. వరి సాధారణ విస్తీర్ణం 1,065 హెకార్లు అయితే సాగు విస్తీర్ణం 949.3 హెక్టార్లు. మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం 1178 హెక్టార్లు అయితే 3110.19హెక్టార్లలో సాగైంది. శనగపంట సాధారణ విస్తీర్ణం 3,092 హెక్టార్లు అయితే 3,288 హెక్టార్లల్లో రైతులు పంటను సాగుచేశారు. వేరుశనగ సాధారణ విస్తీర్ణం 2,315 హెక్టార్లు అయితే రైతులు 2091.88 హెక్టార్లలో పంటను వేశారు. అధికారులు పంటలన్నింటినీ ఈ-క్రాప్ అప్‌లోడ్ చేశారు.

విస్తారంగా వాణిజ్య పంటలసాగు



తుంగభద్ర నది తీరంలో వాణిజ్య పంటల సాగు పెరిగింది. గతంలో వరి పంటను మాత్రమే సాగు చేసే రైతులు ఇప్పుడు మొక్కజొన్న, మిరప, పత్తి, శనగ మొదలగు వాణిజ్య పంటలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. మార్కెట్లో వీటికి మద్దతు ధరకు మించిన రేట్లు లభిస్తుండటం శుభ పరిణామం.
– స్రవంతి, వ్యవసాయాధికారిణి, నందవరం

భక్తిశ్రద్ధలతో పెద్దరాత్రి



విద్యుద్దీపాలంకరణలో వెల్దుర్తి జామియా మసీదు

వెల్దుర్తి: రంజాన్ మాసంలోని 27వ రోజు రాత్రి షబ్ ఏ ఖదర్, లైలతుల్ ఖదర్‌గా పిలుచుకునే పెద్దరాత్రిని మండలంలోని ముస్లింలు మంగళవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ముస్లింల పవిత్ర గ్రంథం ఖురాన్‌ను అల్లాహ్ దివి నుంచి భువికి తన ప్రవక్తచే పంపబడిన రాత్రిగా విశ్వసిస్తరు. ముస్లింలు ఇళ్లలో, సుందరంగా అలంకరించిన మసీదులలో ప్రత్యేక ప్రార్థనలతో, గ్రంథ పఠనాలతో గడిపారు. మసీదులలో మతపెద్దల బోధనలు సాగాయి. అర్ధరాత్రి సమయంలో ఖబరస్తాన్ (శ్మశానం)కు వెళ్లి దివికేగిన తమవారి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జామియా మసీదు కమిటీ ఆధ్వర్యంలో ఖబరస్తాన్‌లో రస్తాలు ఏర్పాటు చేసి, పరిశుభ్రత చేపట్టడంపై హర్షం వ్యక్తం చేశారు.

ప్రతి ఇంటా సంక్షేమం

తుగ్గలి : వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ప్రతి ఇంటికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందించారని ఆ పార్టీ నాయకులు రంగనాథ రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం కేపీ గుడిసెలలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. నాలుగేళ్ల పాలనలో ప్రజలకు అందిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తిమ్మారెడ్డి, నాగిరెడ్డి, హనుమంత రెడ్డి, వెంకటయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

మా భవిష్యత్తు నువ్వే జగనన్న

మద్దికెర : మండలంలోని మద్దికెర, బసినేపల్లి గ్రామాలలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎంపీటీసీ ఆంజనేయులు, మార్కెట్‌యార్డు డైరెక్టర్ భద్రయ్య, సచివాలయ కన్వీనర్ కవిదాసు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అతికించి సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో వెంకటరాముడు, రామకృష్ణ, రామాంజులు మాజీ సర్పంచ్ ప్రతాప్, వైఎస్సార్‌సీపీ నాయకులు చౌడప్ప, ప్రకాష సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే 'గడప గడపకు'

- ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి
- జలజీవన్ మిషన్ ద్వారా చక్రాళ్లలో ఇంటింటికీ తాగునీరు



చక్రాళ్ల గ్రామంలో సంక్షేమ పథకాలతో కలిగిన ప్రయోజనాన్ని లబ్ధిదారుడికి వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ రూరల్: ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడమే గడప గడపకు మన ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చక్రాళ్ల గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచు పూరి శ్రీరాములుతో కలిసి ఇంటింటికి తిరిగి నాలుగేళ్ల పాలనలో ప్రతి కుటుంబానికి జరిగిన లబ్ధి పత్రాలు పంపిణీ చేసి పథకాలను వివరించారు.జగనన్న ప్రభుత్వంలో అన్నివర్గాల వారికి న్యాయం చేయడం జరుగుతుందన్నారు. మళ్లీ జగనన్ననే గెలిపించుకుందామని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణదాస్, ఎంపీడీఓ పార్థసారథి, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, ఆయాశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఆదేశం

గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను పలువురు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి దృష్టికి తీసుకొచ్చారు. ఓవర్‌హెడ్ ట్యాంకు గత మూడు సంవత్సరాల నుంచి శుభ్రం చేయలేదని పంచాయతీ కార్యదర్శి నరసింహ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యేకు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి జలజీవన్ మిషన్ కింద రూ.15లక్షలతో గ్రామంలో పైప్ లైన్ నిర్మాణ పనులు చేయిస్తామన్నారు. ఓ ఇంటి వద్ద ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను సరిచేయాలని విద్యుత్ మండల ఏఈని ఆదేశించారు. అర్హత ఉన్న వారికి ఇంటి నిర్మాణాలు చేపట్టేలా చూడాలని హౌసింగ్ ఏఈకి సూచించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మండల ఎంపీడీఓకు సూచించారు. పీఆర్ డిపార్టుమెంట్ తరఫున ఎవరూ రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరికొందరు గ్రామంలో సంక్షేమ పథకాల అమలులో వివక్ష చూపుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. జగనన్న ప్రభుత్వంలో అలాంటివి ఉండవని అర్హత ఉంటే నేరుగా మీఅకౌంటుకే సొమ్ము జమ చేసేలా పారదర్శకమైన పాలన అమలవుతుందని చెప్పారు.

అమకతాడులో ధార్మిక కార్యక్రమాలు



ప్రవచనాలు బోధిస్తున్న ప్రచారకర్తలు డా. వెంకటరెడ్డి, మేడా సుబ్రమణ్యం

కృష్ణగిరి: తిరుమల తిరుపతి దేవస్థానముల హిందూ ధర్మ ప్రచార పరిషత్ అధ్వర్యంలో మండల పరిధిలోని అమకతాడు గ్రామంలో మంగళవారం రాత్రి తితిదే ధార్మిక కార్యక్రమాలను ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ అధ్వర్యంలో ప్రారంభించారు. గ్రామంలోని మాధవస్వామి దేవాలయంలో హిందూ ధర్మ ప్రచార ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో లలితా పీఠం పీఠాధిపతులు మేడా సుబ్రహ్మణ్యం, మల్లు వెంకటరెడ్డి స్వామి ప్రవచనాలను వివరించారు. సమాజం సుస్థిరంగా ఉండాలంటే ధార్మిక భావన పెరగాలని, అందుకు భారతీయ సనాతన వైదిక ధర్మాన్ని వాడవాడలా తీసుకుపోయే ఉద్దేశంతో శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై మూడు రోజులు కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి రోజు స్థానిక భజన బృందంచే గాన కచేరి నిర్వహించడంతోపాటు మూడవరోజు గోపూజతో కార్యక్రమాలు ముగుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జడల సర్వేశ్వరి గ్రామస్తులు వీరభద్రుడు, బాలు, అర్చకులు గోవిందయ్య, సురేష్, శేషులు, కర్లకుంట తిమ్మయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

కృష్ణగిరి: క్రీడల్లో గెలుపోటములను క్రీడాకారులు సమానంగా తీసుకోవాలని దాత వీరభద్రుడు, మాజీ సర్పంచ్ జానకిరాముడు క్రీడాకారులకు సూచించారు. మండల పరిధిలోని అమకతాడు గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలను మంగళవారం ప్రారంభించారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తి చాటాలని, ఇలాంటి టోర్నీల్లో ప్రతిభ కనపరిచి ఉన్నత శిఖరాలను అందుకోవాలన్నారు. ఈ పోటీల్లో దాదాపుగా 40 జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు బాలహుసేన్, రామకృష్ణ, చక్రి తెలిపారు.

ముస్లింలకు హెల్ప్ సొసైటీ చేయూత



చిన్నారులకు ఖురాన్, జానిమాజ్ అందజేస్తున్న ముస్లిం మతపెద్దలు

పత్తికొండ రూరల్: రంజాన్ పవిత్రమాసం పురస్కరించుకుని మంగళవారం స్థానిక ముస్లిం వీధిలో హెల్ప్ సొసైటీ ఆధ్వర్యంలో అధ్యక్షుడు మీరాహుసేన్ మత గురువుల చేతుల మీదుగా 300 మందికి ఖురాన్ షరీఫ్, జానిమాజ్ పంపిణీ చేశారు. ఇటీవల వివాహం చేసుకున్న పేద దంపతులకు పెళ్లికానుకగా రూ.3వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు పి.రఫీ, ప్రధాన కార్యదర్శి డి.రఫీ, సింగం శ్రీనివాసులు, మతపెద్దలు ఫారుఖ్‌అఫీస్, మహబుబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

21న కల్లయ్య అజ్జకు తులాభారం

హొళగుంద: మండల కేంద్రంలోని సిద్ధేశ్వరస్వామి ఆలయ ఆవరణలో జరుగుతున్న ప్రవచన కార్యక్రమంలో భాగంగా కర్ణాటక రాష్ట్రం గదగ్‌లోని పుట్టరాజు గవాయిలు పుణ్యాశ్రమం మఠం మఠాధీశులు కల్లయ్య అజ్జకు ఈ నెల 21న తులాభారం నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. కార్యక్రమానికి భక్తులు తరలి వచ్చి స్వామి వారి ఆశీస్సులు పొందాలని కోరారు. అదేవిధంగా గురువారం రాత్రి పాల్తూరు, రౌడకుంద, జంగమర హొసళ్లి మఠాలకు చెందిన మహాస్వాములు పురాణ ప్రవచన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ధర్మ సందేశాన్ని ఇస్తారని చెప్పారు. 23న ప్రవచన కార్యక్రమం ముగుస్తుందని వెల్లడించారు.

కొనసాగుతున్న ప్రచారభేరి

వెల్దుర్తి: కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వామపక్షాల ఆధ్వర్యంలో మండలంలో నిర్వహిస్తున్న ప్రచారభేరి కొనసాగుతోంది. మంగళవారం కలుగొట్ల గ్రామంలో సీపీఎం జిల్లా నాయకుడు నగేశ్, సీపీఐ మండల కార్యదర్శి కృష్ణ ఆధ్వర్యంలో ఆయా పార్టీ, అనుబంధ సంఘాల ప్రతినిధులు, సభ్యులు ప్రజలకు కరపత్రాలు పంచుతూ ముందుకు సాగారు. కార్యక్రమంలో చిన్నమాదులు, రాజు, కృష్ణ, మద్దయ్య, శివ, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు

హొళగుంద: దేశ భవిష్యత్తు పాఠశాల తరగతిగదిలో రూపు దిద్దుకుంటుందని, విద్యార్థులందరూ చక్కగా చదువుకొని పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని వందవాగిలి కన్నడ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం ముత్తన్న అన్నారు. మంగళవారం పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సరస్వతి పూజ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలు, నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో తెలుగు పాఠశాల హెచ్‌ఎం హుసేన్‌బీ, ఉపాధ్యాయులు శేషాద్రి, శరణబసప్ప, శేఖర్, ఈరన్న, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని విమర్శించడానికే లోకేష్ పాదయాత్ర



మాట్లాడుతున్న మండల కన్వీనర్లు

ఆలూరు: ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను మంజూరు చేస్తూ ఆదుకుంటున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని విమర్శించడానికే టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పేరుతో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు కనిపిస్తోందని, ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి కాదని దేవనకొండ, ఆస్పరి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు కప్పట్రాళ్ల మల్లికార్జున, పెద్దయ్య అన్నారు. దేవనకొండ మండలం తెర్నెకల్లు గ్రామంలో మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రధానంగా మాజీ సీఎం చంద్రబాబునాయుడు ఆలూరు నియోజకవర్గానికి ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలోనే దాదాపు రూ. వెయ్యి కోట్లతో అభివృద్ధి పనులను మంజూరు చేశారని గుర్తు చేశారు. అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి చేయనివారు నేడు తిరిగి మాకు అధికారాన్ని ఇవ్వండి అంటూ ప్రజలను కోరడం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమంతరెడ్డి, నాగరాజ్, లక్ష్మన్న, తిరుమలేష్, పెద్దరెడ్డి తదితరులు ఉన్నారు.

అందరి సహకారంతో సంఘం అభివృద్ధి

మద్దికెర : అధికారులు, ప్రజాప్రతినిధులు అందరి సహకారంతో సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని నూతనంగా ఎంపికైన మద్దికెర సహకార సంఘం అధ్యక్షుడు ఉయ్యాల శాంతన్న అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన మద్దికెరలోని సహకార సంఘంలో అధ్యక్షుడు, సభ్యులు వీరశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, ఐడీసీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, మాజీ అధ్యక్షుడు వెంకటరాముడు, మార్కెట్‌యార్డు డైరెక్టర్ భద్రయ్య, మాజీ శ్రీనివాసులు సీఈఓ నాగరాజు, సిబ్బంది ఎర్రిస్వామి, ఆదినారాయణతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు పూలమాలలు వేసి సత్కరించారు.

బెల్డోణ సొసైటీ అధ్యక్షుడి బాధ్యతలు స్వీకరణ

చిప్పగిరి: బెల్డోణ సహకార సంఘం సొసైటీ నూతన అధ్యక్షుడిగా దేగులపాలు మల్లికార్జున, సొసైటీ సెక్రటరీగా హరికృష్ణ, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ గుమ్మనూరు నారాయణ ఆధ్వర్యంలో మంగళవారం బాధ్యతలు స్వీకరంచారు. త్రిమెన్ కమిటీ సభ్యులుగా పునగోంట్ల రఘుస్వామి, కురువ రామాంజినప్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం బెల్డోణ సహకార సంఘం సిబ్బంది, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు నూతన అధ్యక్షుడిని సన్మానించారు.

క్రైం కార్నర్

అక్రమ మద్యం స్వాధీనం

నందవరం : అక్రమంగా తెలంగాణ మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ మహేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. మండల పరిధిలోని గంగవరం గ్రామ సమీపంలోని ఆటో స్టాండ్ వద్ద నిందితుడు వడ్డే రమేష్ తెలంగాణ మద్యం అక్రమంగా ద్విచక్రవాహనంపై వెళ్తుండగా పోలీసులు తనిఖీ చేయగా నిందితుడి వద్ద నుంచి 12 తెలంగాణ బట్‌వైజర్ బీర్ బ్యాటిళ్లు లభించాయన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని, బైక్‌ను సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

ముగ్గురిపై అట్రాసిటి కేసు నమోదు

కృష్ణగిరి: మండల పరిధిలోని ఎరుకలచెరువు గ్రామానికి చెందిన బాలమద్దయ్య, కృష్ణ, ముద్దు మద్దయ్యపై మంగళవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన మాదిగ సుంకన్న, ఇతని కుమారుడు రామలక్ష్మన్నతో కలిసి తన పొలంలో పంటకు నీరు పెట్టుకుంటుండగా పక్క పొలానికి చెందిన బాల మద్దయ్య, కృష్ణ, ముద్దు మద్దయ్యలు వచ్చి పొలం సరిహద్దు రాళ్లు జరిపారని వీరితో గొడవ్వారన్నారు. అంతేకాకుండా గొడ్డలి, రాళ్లతో దాడి చేయడం జరిగిందన్నారు. ఈ దాడిలో మాదిగ సుంకన్నకు కుమారుడు రామలక్ష్మన్నకు గాయలు కాగా వెంటనే డోన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. బాధితుడు సుంకన్న ఫిర్యాదు మేరకు ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలి



నాగలదిన్నెలో జగనన్న కాలనీలోని లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

నందవరం : జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఇన్‌చార్జ్ హౌసింగ్ డీఈ ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో జగనన్న కాలనీలో థర్డ్ పార్టీ నిర్మించే ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ..ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎస్‌వీ కనెక్షన్ ఏజెన్సీ సభ్యులకు సూచించారు. జగనన్న కాలనీల్లో ప్రభుత్వం విద్యుత్, తాగునీటి సౌకర్యం, రోడ్లు, డ్రైయినేజీ వంటి వసతులు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఉచితంగా ఇంటికి విద్యుత్ మీటర్లను అందిస్తుందన్నారు. సొంతంగా నిర్మించుకునే లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని వివరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, ఇన్‌చార్జ్ హౌసింగ్ ఏఈ గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సేవలు విస్తృతం చేయాలి

సచివాలయాల సేవలు విస్తృతం చేయాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి సూచించారు. మంగళవారం మండలంలోని నాగలదిన్నె గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



మంటలను ఎలా అదుపుచేయాలో వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఎమ్మిగనూరుటౌన్:పెట్రోల్ బంకుల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉంటే అగ్నిప్రమాదాలు నివారించవచ్చని స్థానిక ఫైర్‌ఆఫీసర్ రామాంజినేయులు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని ఎంజీ పెట్రోల్ బంక్ ఆవరణలో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు మంటలను అదుపులోకి తెచ్చే విధానాలను ప్రదర్శన ద్వారా వివరించారు. ఆయన మాట్లాడుతూ పెట్రోల్ బంకులలో పెట్రోల్ వేసేటప్పుడు సెల్‌ఫోన్‌లను వినియోగించకూడదని, పొగతాగడం లాంటివి చేయకూడదన్నారు. కార్యక్రమంలో పెట్రోల్ బంక్ మేనేజర్ గంగన్న, అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: అగ్నిప్రమాదాల నివారణకు అవగాహన అవసరమని ఆలూరు ఫైర్ అధికారి ఖాద్రి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం హెచ్‌పీ పెట్రోల్ బంకులో అగ్నిప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి, ప్రజలకు డెమో ద్వారా చేసి చూపించారు.

కొండ రాయిని తొలగించండి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్

గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్లలోని ఎస్సీ కాలనీలో నరసన్న దేవాలయం దగ్గర ఉన్న కొండ రాయిని తొలగించి ఆ ప్రాంత ప్రజలకు రక్షణ కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనంద్ బాబు కోరారు. మంగళవారం ఆయా సంఘాల నాయకులు పగిలినపోయిన కొండరాయిని పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఎండవేడిమికి కొండ రాయి పగిలిపోయి దాదాపు పది రోజులు అయిన అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టాలేదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు కరుణాకర్, నరసింహులు, దేవేంద్ర, బతకన్న, మునెప్ప తదితరులు పాల్గొన్నారు.

దూడ పుట్టిన వెంటనే జున్నుపాలు తాపాలి



అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి

మద్దికెర : పాడి రైతులు దూడ పుట్టిన వెంటనే గంటలోపు జున్నుపాలు తాగించాలని పశువైద్యాధికారి కృష్ణనాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని హంప గ్రామంలో పాడి రైతులు వేసవికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ జున్నుపాలు తాగించడం వల్ల వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అలాగే జీవాలకు మంచినీరు అందుబాటులో ఉంచాలన్నారు. ఎండలు తీవ్రంగా వున్నాయని, వీలైనంతవరకు నీడలో ఉంచాలన్నారు.